వాలీబాల్ చాంప్ ఖమ్మం

మహబూబ్‌నగర్ టౌన్, జనవరి 10: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రెండు రోజులుగా జరిగిన ట్రాన్స్‌కో అండ్ డిస్కమ్స్ అంతర్ సర్కిల్ విద్యుత్‌శాఖ రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నీ ముగిసింది. మొత్తం 13 జట్లు టోర్నీలో పాల్గొనగా.. 160 మందికి పైగా క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. లీగ్ మ్యాచ్‌లు రసవత్తరంగా జరగగా.. బుధవారం స్టేడియం మైదానంలో జరిగిన ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. తుదిపోరులో ఖమ్మం 25-21, 25-18తో మహబూబ్‌నగర్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. మూడు, నాలుగు స్థానాల కోసం జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో హైదరాబాద్ 21-19, 23-18తో నల్లగొండపై గెలిచింది. విజేతలకు విద్యుత్‌శాఖ ఎస్ఈ శ్రీరామూర్తి ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో శ్రీనివాస్, డీఈలు పాల్గొన్నారు.

హెచ్‌సీజీ సభ్యులకు కేటీఆర్ అభినందన

హైదరాబాద్/సిటీబ్యూరో, (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సైక్లింగ్ గ్రూప్ (హెచ్‌సీజీ) సభ్యులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు అభినందించారు. త్వరలో వారిని కలవనున్నట్టు బుధవారం ఎక్స్‌లో తెలిపారు. హెచ్‌సీజీ సభ్యులు మూడో ఎడిషన్ సందర్భంగా కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు సైక్లింగ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేశారు. సైక్లింగ్ వినియోగం పెంచాల్సిన బాధ్యతపై అందరికీ అవగాహన కల్పించారు. దేశంలోనే తొలిసారిగా హెచ్‌సీజీ సభ్యులు మూడోసారి ఇలాంటి యాత్రను నిర్వహించామని ఎక్స్‌లో తెలిపారు. తమకు కలిసే అవకాశం కల్పించాల్సిందిగా కేటీఆర్‌ను వారు కోరగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. త్వరలో కలుద్దామంటూ కేటీఆర్ వారికి తెలిపారు.

బెంగళూరు వేదికగా జరిగిన 38వ జాతీయ ఐటీఎఫ్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో తెలంగాణ టీమ్ రెండు స్వర్ణాలు సహా ఐదు రజతాలు, 12 కాంస్య పతకాలు సాధించింది. ఆగస్టులో జరిగే 10వ ఏషియన్ ఐటీఎఫ్ తైక్వాండో టోర్నీలో తెలంగాణ పతక విజేతలు పోటీపడనున్నారు.

రేపటి నుంచి తైక్వాండో టోర్నీ

ఖైరతాబాద్, జనవరి 10: ఇంటర్నేషనల్ తైక్వాండో చాంపియన్ షిప్ లీగ్ పోటీలు ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుగనున్నాయి. బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పోటీల నిర్వహకులు, ప్రముఖ మెజీషియన్ సామల వేణు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ 15 దేశాల నుంచి టీమ్‌లు వస్తున్నాయని, ఒక టీమ్‌లో ఐదుగురు ప్లేయర్లు ఉంటారని తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త శ్రీకృష్ణ చాముండేశ్వర మహర్షి, అబ్దుల్లా గ్రూపు ఆఫ్ కంపెనీస్ చైర్మన్ అబ్దుల్లా, కవితా శ్రీనివాసన్ పాల్గొంటారని అన్నారు.

భారత్ పతక జోరు

జకార్తా: ఏషియన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత పతక జోరు దిగ్విజయంగా సాగుతున్నది. బుధవారం జరిగిన మహిళల 10మీటర్ల ఎయిర్‌రైఫిల్ ఫైనల్లో నాన్సీ 252.8 పాయింట్లతో పసిడి పతకంతో మెరువగా, భారత్‌కే చెందిన ఇలావెనిల్ వాలరివన్(252.7) రజతం ఖాతాలో వేసుకుంది. ఇదే విభాగంలో మొహులీ ఘోష్ (210) నాలుగో స్థానంలో నిలిచింది. పురుషుల 10మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో రుద్రాంక్ష్ పాటిల్ 228.7 స్కోరుతో కాంస్యం దక్కించుకున్నాడు.

సాత్విక్, చిరాగ్ శుభారంభం

కౌలాలంపూర్: మలేషియా ఓపెన్‌లో భారత స్టార్ జోడీ సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్‌శెట్టి శుభారంభం చేసింది. బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాత్విక్, చిరాగ్ ద్వయం 21-18, 21-19తో షోహిబుల్, మౌలానా బగాస్ జోడీపై విజయంతో రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది.

రోహిత్‌పైనే నజర్

భారత్, అఫ్గానిస్థాన్ తొలి టీ20 నేడు • మెగాటోర్నీకి ముందు ఆఖరి సిరీస్

భారత్, అఫ్గానిస్థాన్ పొట్టి పోరుకు వేళయైంది. మొహాలీ వేదికగా గురువారం ఇరు జట్లమధ్య తొలి టీ20 మ్యాచ్ జరుగనుంది. దక్షిణాఫ్రికా పర్యటన ముగించుకుని స్వదేశం చేరుకున్న టీమ్‌ఇండియా టీ20 ప్రపంచకప్ టోర్నీకి ముందు ఆఖరి సిరీస్ ఆడబోతున్నది. కుర్రాళ్లు, సీనియర్ల మేళవింపుతో సమతూకంగా కనిపిస్తున్న భారత్..సొంతగడ్డపై అఫ్గన్‌ను చిత్తుచేయాలని చూస్తున్నది. ముఖ్యంగా ఏడాది తర్వాత జట్టులోకి వచ్చిన కెప్టెన్ రోహిత్‌శర్మపై అందరి నజర్ ఉంది. వన్డే ప్రపంచకప్ సూపర్‌ఫామ్‌ను టీ20ల్లోనూ కొనసాగించేందుకు హిట్‌మ్యాన్ తహతహలాడుతున్నాడు. వ్యక్తిగత కారణాలతో తొలి పోరుకు విరాట్‌కోహ్లీ దూరమయ్యాడు.

రాత్రి 7.00 నుంచి స్పోర్ట్స్-18లో

మొహాలీ: సొంతగడ్డపై సీజన్‌కు భారత్ అస్త్రశస్త్రాలతో సిద్ధమైంది. దక్షిణాఫ్రికాతో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను సమం చేసుకున్న టీమ్‌ఇండియా..అఫ్గానిస్థాన్‌తో టీ20 సిరీస్‌కు సై అంటున్నది. గురువారం ఇరు జట్లు తొలి పోరులో తలపడనున్నాయి. అమెరికా, వెస్టిండీస్ వేదికలుగా జూన్‌లో జరుగనున్న ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్ టోర్నీకి ముందు జరుగుతున్న ఈ సిరీస్‌లో సత్తాచాటాలని టీమ్‌ఇండియా క్రికెటర్లు ఉవ్విళ్లూరుతున్నారు. 14 నెలల తర్వాత తిరిగి జట్టులోకి వచ్చిన రోహిత్‌శర్మపై అందరి కండ్లు ఉన్నాయి. ఇటీవల ముగిసిన వన్డే ప్రపంచకప్‌లో హిట్‌మ్యాన్ తనదైన దూకుడు ప్రదర్శించాడు. ప్రత్యర్థి ఎవరైనా ఆది నుంచే బౌండరీలతో చెలరేగుతూ జట్లుకు మెరుగైన శుభారంభాలు అందించాడు. అదే జోరు మరోమారు కొనసాగిస్తే టీమ్‌ఇండియాకు తిరుగుండకపోవచ్చు. యువ క్రికెటర్ యశస్వి జైస్వాల్‌తో కలిసి రోహిత్ ఇన్నింగ్స్ మొదలుపెట్టనున్నాడు. కోహ్లీ గైర్హాజరీలో లోకల్ బాయ్ శుభ్‌మన్ గిల్ మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చే చాన్స్ ఉంది. మిడిలార్డర్‌లో తిలక్‌వర్మ, రింకూసింగ్, శాంసన్, జితేశ్‌శర్మ బరిలో దిగనున్నారు. కీపర్ విషయంలో శాంసన్, జితేశ్ మధ్య పోటీ నెలకొంది. దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో రింకూసింగ్ అంచనాలకు మించి రాణించాడు. ఫినిషర్ రోల్‌కు రింకూ పూర్తి న్యాయం చేశాడు. హైదరాబాదీ యువ క్రికెటర్ తిలక్ వర్మ..అవకాశాలను అందిపుచ్చుకోవడంలో విఫలమవుతున్నాడు. సూర్యకుమార్, కేఎల్ రాహుల్, శ్రేయాస్ అయ్యర్ గైర్హాజరీలో మెరుగ్గా రాణిస్తేనే తిలక్‌కు జాతీయ జట్టులో చోటు దక్కే అవకాశముంది. బౌలింగ్ విషయానికొస్తే..అర్ష్‌దీప్‌సింగ్, అవేశ్‌ఖాన్, ముకేశ్ కుమార్ పేస్ బౌలింగ్‌ను ముందుకు నడిపించనుండగా, కుల్దీప్‌యాదవ్, రవి బిష్ణోయ్ ఒకరికి తుది జట్టులో చోటు దక్కే చాన్స్ ఉంది.

జద్రాన్

రషీద్‌ఖాన్ లేకుండానే

గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో స్టార్ స్పిన్నర్ రషీద్‌ఖాన్ లేకుండానే అఫ్గానిస్థాన్ బరిలోకి దిగుతున్నది. యువ క్రికెటర్ ఇబ్రహీం జద్రాన్..కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. భారత్‌తో తొలిసారి టీ20 ద్వైపాక్షిక సిరీస్ ఆడుతున్న అఫ్గన్ తమదైన రోజున ఎంతటి మేటి జట్టునైనా ఓడించడంలో ముందుంటుంది.

తొలి టీ20కి కోహ్లీ దూరం

భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ వ్యక్తిగత కారణాలతో అఫ్గానిస్థాన్‌తో తొలి టీ20 మ్యాచ్‌కు దూరమయ్యాడు. ఈ విషయాన్ని చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ మీడియా సమావేశంలో వెల్లడించాడు. సిరీస్‌లో మిగిలిన రెండు మ్యాచ్‌లకు కోహ్లీ అందుబాటులో ఉంటాడని తెలిపాడు. దాదాపు ఏడాది తర్వాత రోహిత్‌శర్మ, విరాట్‌కోహ్లీ టీ20 జట్టులోకి వచ్చారు. 2022 టీ20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్‌తో సెమీఫైనల్ మ్యాచ్ వీరిద్దరికి చివరి మ్యాచ్. అయితే ఈ ఏడాది అమెరికా, వెస్టిండీస్ వేదికలుగా జూన్ లో జరుగనున్న మెగాటోర్నీ కోసం కోహ్లీ, రోహిత్‌కు సెలెక్టర్లు మరోమారు అవకాశమిచ్చిన సంగతి తెలిసిందే.

జట్ల అంచనా

భారత్: రోహిత్(కెప్టెన్), జైస్వాల్, గిల్, తిలక్‌వర్మ, జితేశ్/శాంసన్, రింకూసింగ్, అక్షర్, కుల్దీప్, అవేశ్‌ఖాన్, అర్ష్‌దీప్‌సింగ్, ముకేశ్‌కుమార్

అఫ్గానిస్థాన్: హజ్రతుల్లా, గుర్బాజ్, జద్రాన్(కెప్టెన్), ఒమర్జాయ్, నజీబుల్లా జద్రాన్, నబీ, గులాబ్దీన్ నయిబ్/కరీమ్ జనత్, ముజీబుర్ రెహమాన్, ఖాయిస్ అహ్మద్, నవీన్ ఉల్ హక్, ఫారుఖీ.

ఫైనల్లో కర్ణాటక X హర్యానా

సెమీస్‌లో ఓడిన తెలంగాణ.. జాతీయ స్థాయి కబడ్డీ టోర్నీ

కామారెడ్డి,జనవరి 10: జిల్లా కేంద్రం వేదికగా జరుగుతున్న జాతీయ స్థాయి అండర్-17 బాలుర కబడ్డీ టోర్నీలో హర్యానా, కర్ణాటక ఫైనల్‌కు చేరుకున్నాయి. బుధవారం జరిగిన తొలి సెమీఫైనల్లో కర్ణాటక 7 పాయింట్లతో ఢిల్లీపై విజయం సాధించింది. మరో సెమీస్‌లో హర్యానా 29 పాయింట్ల తేడాతో ఆతిథ్య తెలంగాణపై ఘన విజయం సొంతం చేసుకుంది. గెలుపు కోసం తెలంగాణ కడదాకా కొట్లాడింది. లైట్ల వెలుతురులో కబడ్డీ పోటీలు స్థానికులను కట్టిపడేశాయి. గురువారం హర్యానా, కర్ణాటక జట్ల మధ్య టైటిల్ పోరు జరుగనుంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.